ఈనాడు
మహబూబాబాద్
మంగళవారం అక్టోబరు 8, 2024

మహిళలకు పండగ చీరలు అందించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

కురవి, న్యూస్‌టుడే: మహిళలకు బతుకమ్మ పండగ సందర్భంగా చీరల పంపిణీ ఎందుకు చేయలేదని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. సోమవారం ఆమె బారాస నాయకులతో కలిసి కురవిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బతుకమ్మ చీరలకు బదులుగా రూ.500 ఇస్తామని చెప్పి పండగ వచ్చినా ఎందుకు అందించలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పద్ధతి లేకుండా మాట్లాడుతున్నారని, వారి భాష చూసి మంత్రులు అంతకంటే ఎక్కువ అనాగరికంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మహబూబాబాద్ ఎంపీ, డోర్నకల్, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు ఇంటిగ్రేటెడ్ గురుకులాలను తీసుకురావాలన్నారు. మంత్రి కొండ సురేఖ నోటికి వచ్చినట్లు చౌకబారుగా మాట్లాడుతున్నారని తెలిపారు. సమావేశంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ బిందు, నాయకులున్నారు.

వీరభద్రుడి ఆలయంలో పూజలు:
కురవి: భద్రకాళి సమేత కురవి శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం వీరభద్రుడిని దర్శించుకున్నారు.

హామీల అమలులో విఫలం

మహబూబాబాద్‌రూరల్: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న డిమాండ్ చేశారు. కంబాలపల్లి శివారు దుబ్బతండాలో సోమవారం సీపీఎం గ్రామ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. కంబాలపల్లిలోని సర్వే నెంబర్ 186లో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా శేషం ప్రశాంత్, సహాయ కార్యదర్శిగా పెద్ద శ్రీనుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కుర్ర మహేష్, మండల కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, సభ్యులున్నారు.

రైతేరాజు విరాలు 8లో..



మార్కెట్‌కు పోటెత్తిన మక్కలు

మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం రైతులు మక్కలు అధిక మొత్తంలో తెచ్చారు. 104 రాశులకు 2,609 (4,349 బ్యాగ్‌లు) క్వింటాళ్లు వచ్చాయి. క్వింటాలుకు రూ. 2,455 గరిష్ఠ ధర రాగా రూ.2.125 కనిష్ట ధర వచ్చింది. – న్యూస్‌టుడే, నెహ్రూసెంటర్

బతుకమ్మ దారిలో.. మొక్కుబడి ఏర్పాట్లు!

బతుకమ్మ వేడుకలు ప్రారంభమై సోమవారానికి ఆరు రోజులు గడిచాయి.. ఈ నెల పదోతేదీన సద్దుల బతుకమ్మ సంబరాలు జరగనున్నాయి.. నిమజ్జన ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో ఏర్పాట్లు ఊపు కరవైంది. ఒకవైపు మహిళలు ఆ సంబరాన్ని పెద్ద ఎత్తున జరుపుకోవాలని చూస్తుంటే ఏర్పాట్లు వేగం పుంజుకోలేదు. సోమవారం కొన్ని ప్రాంతాల్లో 'న్యూస్‌టుడే' పరిశీలన జరపగా పరిశుభ్రత కొరవడింది. కొన్ని చోట్ల ఏర్పాట్లు మొదలు పెట్టలేదు.
–మహబూబాబాద్, న్యూస్‌టుడే


మహబూబాబాద్‌లో..



పరిశీలన

దారి బాగు చేయరూ

● పట్టణం/గ్రామం : మహబూబాబాద్
● బతుకమ్మలు ఆడేది, నిమజ్జన ప్రాంతం: ఎన్టీఆర్ మైదానం, నిజాం చెరువు
● గతేడాది ఏర్పాట్లకు నిధులు: రూ. 5 లక్షలు(జనరల్ ఫండ్)
● ఈ ఏడాది: రూ.5 లక్షలు
● నిమజ్జన ప్రాంతానికి వెళ్లే రహదారి, ప్రదేశం పరిస్థితి: ఎన్టీఆర్ మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నారు.
● చేయాల్సిన పనులు: స్నేహనగర్‌లో రహదారికి ఇరువైపుల చెత్త, పిచ్చి మొక్కలను తొలగించాలి. నిజాం చెరువులో ఇటీవల నిమజ్జనం చేసిన గణపతి ప్రతిమలు, విగ్రహాల వ్యర్థాలను తొలగించాలి. ● **ఇతర సమస్యలు:** ఎన్టీఆర్ మైదానం నలువైపుల పది అడుగుల వెడల్పుతో బాట సౌకర్యం కల్పించాలి. హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేయాలి. గతేడాది మైదానం ప్రహరీ పక్కన రెండు నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. ఈసారి మరో రెండు నెలకొల్పాలి.
– న్యూస్‌టుడే, మహబూబాబాద్

రక్షణ చర్యలు చేపట్టాలి

● మరిపెడ ● కొండ సముద్రం చెరువు, నల్ల చెరువు ● ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇవ్వలేదు. ● రూ.3 లక్షలు (సాధారణ నిధులు) ● పారిశుద్ధ్య పనులు చేపట్టి, బ్లీచింగ్ చేశారు. గుంతలు పూడ్చారు. ● విద్యుత్తు దీపాల ఏర్పాటు, రక్షణ చర్యలు చేపట్టాలి. ● వాటర్ ప్రూఫ్ షామియానాలు(టెంట్లు) ఏర్పాటు చేస్తే వర్షం వచ్చినా తడవకుండా నిలుచునేందుకు అవకాశం ఉంటుంది.
– న్యూస్‌టుడే, మరిపెడ

సౌకర్యాలు కరవు

● తొర్రూరు ● తొర్రూరు చెరువు ● బతుకమ్మ మొదటిరోజు, దసరా ఏర్పాట్లుకు మొత్తం రూ. 16 లక్షలు ● రూ.16 లక్షలు ● తొర్రూరు చెరువు వద్దకు ఎల్వైఆర్ గార్డెన్ రోడ్డు, మున్సిపాలిటీ కార్యాలయం రోడ్డు నుంచి మహిళలు తరలివస్తారు. ఎల్వైఆర్ గార్డెన్ నుంచి వచ్చే రోడ్డులో ఇటీవల సీసీ రోడ్డు పూర్తిస్థాయిలో లేకపోవడంతో వర్షాలకు బురదమయంగా మారుతోంది. ● బతుకమ్మ ఆడే ప్రదేశంలో పూర్తిస్థాయిలో సన్నకంకర, రాతిపొడి పోస్తే బాగుంటుంది. ● రూ.16 లక్షలు కేటాయించిన పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసిన దాఖలాలు కన్పించడం లేదు. పైపైనే పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే ప్రయోజనం ఉంటుంది.
– న్యూస్‌టుడే, తొర్రూరు


తొర్రూరులో బతుకమ్మ ఆడే ప్రదేశంలో నామమాత్రంగా పోసిన కంకర



దంతాలపల్లి చెరువు వద్ద అపరిశుభ్రంగా

దంతాలపల్లి: చిన్న చెరువు వద్ద బతుకమ్మ ఆడే ప్రదేశమంతా సీసీ నిర్మాణం చేపట్టాలి. ఆ ప్రదేశంలో మెట్ల నిర్మాణం చేపట్టాలి. విద్యుత్తు లైట్లను ఏర్పాటు చేయాలి.

మరికొన్ని ప్రాంతాల్లో

కొత్తగూడ: కొత్తగూడలో బతుకమ్మను బూర్కపల్లి వాగులో నిమజ్జనం చేస్తుంటారు. వాగు అంచున మెట్లను ఏర్పాటు చేయాలి. పూర్తిస్థాయిలో లైట్లను ఏర్పాటు చేయాలి.

గార్ల: స్థానిక పాకాలేటిలో ప్రస్తుతం నీటి ప్రవాహం అధికంగా ఉంది. గజఈతగాళ్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. బారికేడ్లు, విద్యుత్తు దీపాలు నెలకొల్పాలి.

గూడూరు: పాకాలవాగు వద్ద విద్యుత్తు స్తంభం ఒరిగి ఉంది. కొందరు మద్యాన్ని తాగి సీసాలను బతుకమ్మ ఆడే ప్రదేశంలో పడవేస్తున్నారు. నియంత్రించాలి. పాకాల వాగు వంతెనకు రక్షణ గోడలు ఏర్పాటు చేయాలి.

బయ్యారం: దామరచెరువు కట్టపై పెరిగిన చెట్లు, పొదలు తొలగించి, శుభ్రం చేయించాలి. విద్యుత్తు దీపాలు నెలకొల్పాలి.

☛ జీకేపేట పంచాయతీలో బతుకమ్మలను అలిగేరు వాగుకు తీసుకెళ్తారు. వాగు వద్ద కొంత ప్రాంతాన్ని శుభ్రం చేసినా..మరి కొంత ప్రదేశంలో శుభ్రం చేసి రహదారి వెంట దీపాలు ఏర్పాటుచేయాలి.


బయ్యారం పాకాల వాగు వద్ద

మానుకోట నుంచి ఎనిమిది ప్రత్యేక బస్సులు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లాలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈ నెల 9న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందించనున్న ఉద్యోగ నియామక పత్రాల కోసం అభ్యర్థులను తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా జిల్లాలో 376 మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారన్నారు. వారు వివిధ ప్రాంతాల నుంచి ఒక రోజు ముందుగా జిల్లా కేంద్రానికి చేరుకోవాలన్నారు. 8 ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి బస్సులో పోలీసు, రెవెన్యూ, వైద్య సిబ్బంది ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎం. చెన్నయ్య, జడ్పీ సీఈవో నర్మద, డీపీవో హరిప్రసాద్, జిల్లా వైద్యశాఖాధికారి మురళీధర్, జిల్లా విద్యాశాఖాధికారి రాజేశ్వర్‌రావు తదితరులున్నారు.

భాజపాతోనే అభివృద్ధి సాధ్యం

గూడూరు, న్యూస్‌టుడే: దేశాభివృద్ధి భాజపాతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. గూడూరులోని పార్టీ మండల అధ్యక్షుడు గుండబోయిన మల్లేష్ ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మోదీ నేతృత్వంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన భాజపా అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. రాష్ట్రంలోని ప్రజలు, యువత భాజపా వైపు చూస్తున్నారన్నారు. కార్యకర్తలు గ్రామాలల్లో దేశంలో జరుగుతున్న అభివృద్ధిని వివరిస్తూ సభ్యత్వ నమోదులో చురుకుగా పాల్గొనాలన్నారు. పదిహేను వేల సభ్యత్వాలను నమోదయ్యేలా చూడాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్ నాయక్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాంబాబు నాయక్, మేరుగు మల్లయ్య, కోరె అనిల్, పడాల నాగరాజు, శ్రీశైలం, లక్ష్మణ్, అయిలయ్య, రమేష్ తదితరులున్నారు.


గూడూరులో సభ్యత్వ నమోదు చేస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర రావు, నాయకులు

వరద బాధితులను ఆదుకోవడంలో విఫలం

నెల్లికుదురు, న్యూస్‌టుడే: వరద బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం కంటితుడుపు చర్యలు చేపట్టిందని భాజపా జిల్లా అధ్యక్షుడు వెలమంచి వెంకటేశ్వర్‌రావు విమర్శించారు. మండలంలో సోమవారం పర్యటించి, భాజపా చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్‌నాయక్, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాంబాబు, మండల అధ్యక్షుడు భవానీప్రసాద్ తదితరులున్నారు.

రైతులకు మెరుగైన సేవలు

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో సరకులు విక్రయించేందుకు వచ్చే రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని మార్కెట్ కమిటీ ఛైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్ నూతన పాలక మండలి అధ్యక్షుడు గంట సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు పెద్దబోయిన ఐలయ్యతోపాటు సభ్యులు సంకెపల్లి నారాయణరెడ్డి, చింతకుంట్ల యాదగిరి, మహ్మద్ అయూబ్‌ఖాన్, మధుసూదన్, ఆవుల శ్రీనివాస్, కాకి విజయ, కొట్టం రాము, గుగులోతు వీరన్న, చిదురాల వసంతరావు, వోలం రమేశ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మార్కెట్ అధికారులు, వ్యాపారులు, దడువాయిలు వారికి స్వాగతం పలుకుతూ సన్మానించారు. పాలక మండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యాపారుల సహకారంతో మార్కెట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకహోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, పీసీసీ సభ్యుడు దస్రూనాయక్, రావుల మురళి, బండార వెంకన్న, కదిర సురేందర్, తేరాల వీరభద్రం తదితరులున్నారు.


బాధ్యతలు చేపట్టిన ఛైర్మన్, పాలక మండలి సభ్యులు



కరవు భత్యం విడుదల చేయాలని వినతి

బయ్యారం, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న కరవు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ టీఎస్‌టీటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. దసరా కానుకగా పెండింగ్‌లో ఉన్న కరవు భత్యాలను ప్రభుత్వం విడుదల చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు భద్రూనాయక్, రవీందర్‌నాయక్, కిరణ్‌సింగ్, ముల్సూర్, మురళీనాయక్, మోహన్ ఉన్నారు.

పోడు చుట్టూ వసూలు రాజాలు!

డబ్బులిస్తేనే బోరుబావి తవ్వకాలకు అనుమతి

ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, బయ్యారం



పోడు హక్కు పత్రాలు కలిగిన రైతులకు అటవీశాఖ సిబ్బంది నుంచే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పట్టాలు పొందిన భూముల్లో పంటల సాగు కోసం బోరుబావులను తవ్వుకోవడానికి కొందరు అటవీశాఖ సిబ్బందికి ఆమ్యామ్యాలు సమర్పించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

రూ.పది వేలు ఇస్తేనే

పోడు భూముల్లో ఏటా వానాకాలంలోనే పంటలు పండుతాయి. కారణం సాగునీటి ఆధారం లేకపోవడం. దీంతో చాలా చోట్ల రైతులు ఏటా రెండు పంటలను పండించుకోవాలనే ఆశతో అప్పులు చేసి బోరుబావుల తవ్వకం చేసుకుంటున్నారు. దీన్ని ఆసరాగా తీసుకున్న ఆయా రేంజ్‌ల పరిధిలో పనిచేసే కొంత మంది అటవీశాఖ సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్నారు. రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు ఇస్తేనే బోరుబావి తవ్వకం పనులు జరుగుతాయని హెచ్చరిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మామూళ్లు ఇచ్చుకోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

☛ మహబూబాబాద్ డివిజన్ పరిధిలోని ఒక ఏజెన్సీ ప్రాంతంలో సిబ్బంది డబ్బులు వసూలు చేసినట్లు ఉన్నతాధికారులకు తెలిసింది. ఈ విషయంలో అధికారులు చూసీచూడనట్లు వదిలేశారు.

☛ మహబూబాబాద్ డివిజన్ పరిధి ఒక రేంజ్‌లోని ఏజెన్సీ ప్రాంతంలో హక్కు పత్రాలున్న కొందరు రైతులు ఏప్రిల్, మే నెలల్లో తమ భూముల్లో బోరుబావుల తవ్వకం చేస్తుండగా అటవీశాఖ సిబ్బంది వెళ్లి అడ్డుకున్నారు. రూ.10 వేలు తీసుకున్నారని అన్నదాతలు వాపోయారు. ఇలా ఆ రేంజ్ పరిధిలో 35 మంది రైతుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

☛ గూడూరు డివిజన్ పరిధిలోని రెండు రేంజ్ పరిధిలో బోరుబావుల తవ్వకం విషయంలో అటవీశాఖ సిబ్బంది జోక్యం చేసుకోవద్దని ఒక పేరున్న ప్రజాప్రతినిధి చెప్పినా వారు మాత్రం తమ పంథాను మార్చుకోలేదు. ఒక్కో రైతు నుంచి రూ.5 వేల వరకు తీసుకున్నారు.

ఎనుమాముల మార్కెట్‌కు దసరా సెలవులు

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా నాలుగు రోజులపాటు దసరా సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల సోమవారం తెలిపారు. ఈ నెల 10న దుర్గాష్టమి, 11న మహర్నవమి, 12న విజయదశమి పండగ సందర్భంగా, 13న మార్కెట్‌కు వారాంతపు సెలవు కావడంతో బంద్ ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత రోజుల్లో రైతులు తమ పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావద్దని సూచించారు.

సంఘం బలోపేతానికి కృషి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ఆర్థికంగా, రాజకీయంగా వెనకబడిన పద్మశాలి సంఘీయుల సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు సంఘం బలోపేతానికీ కృషి చేస్తానని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.మురళి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శివభక్త మార్కండేయ ఆలయ ట్రస్ట్ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్‌బాపూజీ పోరాట స్ఫూర్తితో సంఘీయుల సమస్యల పరిష్కారానికి అందరు కలిసి పని చేయాలన్నారు. శివభక్త మార్కండేయ ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడిగా కైరంకొండ వీరన్న, ప్రధాన కార్యదర్శిగా తవుటం శ్రీనివాస్, కోశాధికారిగా వి.రాజేందర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఓ నాయకుడిని జిల్లా అధ్యక్షుడిని చేస్తే సంఘానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారని అతనికి సంఘానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు అనుమాళ్ల వెంకటేశ్వర్లు, చిలుకమారి వెంకటేశ్వర్లు, బొమ్మ వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, కస్తూరి శ్రావణ్, వి.సాగర్, శ్రీనివాస్, కోమటి శ్రీనివాస్, పుల్లయ్య, వార్డు కౌన్సిలర్ చిట్యాల జనార్దన్ పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడిని సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు కె.మురళి


సీతారాం తండా మార్గంలో నేలకొరిగి ఎండిపోయిన మామిడి చెట్లు


పురుషోత్తమాయగూడెం వంతెన సమీపంలో పొలం ఇసుక దిబ్బలా..

కళకళలాడేదెప్పుడో..?

మరిపెడ, మానుకోట, న్యూస్‌టుడే: గత ఆగస్టు 31. . ఆ తండా ప్రజలకు కాళరాత్రి.. ఆకేరు వాగు ఒడ్డున. . పురుషోత్తమాయగూడెం హైలెవల్ వంతెన సమీపం. . పచ్చని పంట పొలాలు.. మామిడి తోట.. పక్కనే మహబూబాబాద్-మరిపెడ జాతీయ రహదారి.. అలాంటి వాతావరణంలో 50కి పైగా ప్రశాంతంగా జీవిస్తున్న మరిపెడ మండలం సీతారాంతండావాసులకు ఆ రోజు రాత్రి కురిసిన భారీ వర్షం ఒక్కసారిగా భయాందోళనకు గురిచేసింది. వరద తండాను ముంచెత్తుతూ ప్రవహించింది. ఇళ్ల పైకప్పులకెక్కి ప్రాణాలు కాపాడుకోవాల్సిన దుస్థితిని తెచ్చిపెట్టింది. పచ్చని పొలాలు వరదలో కందకాలుగా మారాయి. ఇసుక మేటలు వేశాయి. మామిడి తోటలోని చెట్లు నేలకు ఒరిగాయి. ప్రస్తుతం ఎండిపోయి జీవకళను కోల్పోయాయి. ఈ సంఘటన జరిగి నెలరోజులవుతున్నా పునరుద్ధరణ పనులు మాత్రం ఎక్కడివక్కడే ఉన్నాయి. ప్రధాన రహదారిపై ఉన్న వంతెనను పూర్తిస్థాయిలో పటిష్ఠంగా పునరుద్ధరించలేదు. ఫలితంగా ఆర్టీసీ బస్సుల రాకపోకలు జరగడం లేదు. తండావాసులను స్వచ్ఛంద సంస్థలు కొంతమేరకు సాయపడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు కేంద్ర బృందం కూడా ఈ తండాలో పర్యటించింది. ఇక తండావాసులు సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

విద్యుత్తు ఉద్యోగుల బదిలీలు!

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లాలో విద్యుత్ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ సోమవారం రాత్రి ప్రారంభమైంది. జిల్లాలోని మహబూబాబాద్, తొర్రూరు విద్యుత్తు డివిజన్లతో పాటు ఏడు సబ్‌డివిజన్లు 21 సెక్షన్ కార్యాలయాల పరిధిలో క్షేత్రస్థాయిలో, కార్యాలయాల్లో రెండేళ్లు విధులు పూర్తి చేసుకున్న వారిలో యాభై శాతం మందిని బదిలీలు చేసేందుకు సంస్థ మార్గదర్శకాలు జారీ చేసింది. లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, అసిస్టెంట్ లైన్‌మెన్లు డివిజన్ అధికారుల ఆధ్వర్యంలో బదిలీలు చేయనున్నారు. ఏడీఈలు, ఏఈలు, సబ్ ఇంజినీర్లు, వివిధ కార్యాలయాల్లో విధులు నిర్వహించే సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఏకౌంట్స్ ఆఫీసర్లు, ఇతర సిబ్బందిని ఎస్ఈ స్థాయిలో బదిలీలు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. మహబూబాబాద్ డివిజన్‌లో 19 మంది లైన్‌మెన్లు, 13 మంది లైన్‌ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేసేందుకు జాబితా సిద్ధమైనట్లు సమాచారం. తొర్రూరు డివిజన్‌లో కూడా బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. సోమవారం అర్ధరాత్రి వరకు బదిలీల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మరిపెడ: మరిపెడ, తానంచర్ల, ఎల్లంపేటలోని ఎరువులు, పురుగు మందుల విక్రయ కేంద్రాలలో వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించారు. అనుమతి లేని వివిధ కంపెనీలకు చెందిన ఎరువులకు సంబంధించి ఓ ఫాంలు, పురుగు మందుల విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించారు. వెంటనే నిలిపివేయాలని సంబంధిత దుకాణదారులకు ఆదేశాలు జారీ చేశారు. తనిఖీల్లో ఏడీఏ విజయ్‌చంద్ర, మరిపెడ ఏవో వీరాసింగ్, డోర్నకల్ ఏవో మురళీమోహన్, కురవి ఏవో నర్సింహారావు పాల్గొన్నారు.

భూమి పూజ

నెల్లికుదురు, న్యూస్‌టుడే: నెల్లికుదురు నిర్మించే ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి సోమవారం జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా యాదగిరిరెడ్డి, రామచంద్రు, ఉప్పలయ్య, ఆదిరెడ్డితోపాటు పలువురు పనులు ప్రారంభించారు.

నెట్టింట్లో.. అమ్మేస్తున్నారు!

● అరుదైన జంతువుల అక్రమ రవాణా

ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి



ఉమ్మడి వరంగల్ జిల్లా అడవుల్లో వన్యప్రాణులకు నెలవైన ప్రాంతాలున్నాయి. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో గోదావరి తీరం వెంట దట్టమైన, పచ్చని అడవుల్లో జంతువుల ఆవాసానికి అనుకూలంగా ఉంటుంది. వేటగాళ్లతో వాటికి ముప్పు వాటిల్లుతోంది.. గుట్టుగా వేటాడి వన్యప్రాణుల చర్మాలు, గోళ్లు, మాంసంతో వ్యాపారం చేసుకుంటున్నారు. అధికారులు చర్యలు తీసుకుంటున్నా.. వేట మాత్రం ఆగడం లేదు.. గత శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అరుదైన జంతువులను ఏకంగా ఆన్‌లైన్‌లో విక్రయానికి పెట్టారు. నూతన పంథాలో దుండగులు పాంగోలిన్(అలుగు)ను అక్రమ రవాణా చేసేందుకు సిద్ధమయ్యారు.

చెన్నై బ్యూరో సభ్యులు మాటేసి..

ఇక్కడ ఇంత తతంగం జరుగుతున్నా.. స్థానిక అధికారులు ఈ విషయాన్ని పసిగట్టలేదు. వాట్సాప్ గ్రూపును చెన్నై కేంద్రంగా నడిచే వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బోర్డు గుర్తించింది. ఆ వాట్సాప్ గ్రూప్‌లో బ్యూరో సభ్యులు కొనుగోలుదారులుగా సంప్రదింపులు చేశారు. ఇద్దరు సభ్యులు ఆ నెంబర్ల ఆధారంగా చాట్ చేసుకుంటూ వరంగల్ చేరుకున్నారు. దుండగులు చెప్పినట్లుగా భూపాలపల్లి, కాటారం ప్రాంతాలకు వచ్చారు. మాటు వేసి అలుగును, ముగ్గురు నిందితులను పట్టుకున్నారు.

వాట్సాప్ గ్రూపు ఏర్పాటు..

పాంగోలిన్ లాంటి అరుదైన వన్యప్రాణుల విక్రయాలకు దేశవ్యాప్తంగా పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు సమాచారం. పురాతన వస్తువుల పేరిట దేశవ్యాప్త నెట్‌వర్క్‌తో ఓ వాట్సాప్ గ్రూపు నడుపుతున్నారు. ఇందులో భూపాలపల్లి జిల్లాకు చెందిన కొందరు ఉన్నట్లు తెలిసింది. వారే అలుగు ఫొటోలను అప్‌లోడ్ చేసి అమ్మకానికి పెట్టారు.. ఇలాంటి నెట్‌వర్క్‌తో ఇక్కడి వారికి సంబంధాలు ఉండటం విస్తుగొల్పుతోంది. ఎన్నేళ్లుగా ఈ అక్రమ వ్యాపారం జరుగుతుందో తెలుసుకునే పనిలో అటవీ అధికారులు, పోలీసులు ఉన్నారు.

మరో 8 మంది గుర్తింపు..

అలుగు విక్రయంలో ముందుగా ముగ్గురిని పట్టుకున్నారు. అయితే దీని వెనుక తతంగం నడుపుతున్న 8 మందిని గుర్తించారు. కాటారం, భూపాలపల్లి, మహాముత్తారం మండలాలకు చెందిన వివిధ రంగాలకు చెందిన వారుండటం గమనార్హం. అందులో ఓ రాజకీయ నేత కూడా ఉన్నాడు. ఐదుగురిని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వారిని పట్టుకుంటే ఈ దందా పూర్తిస్థాయిలో వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు చెందినవారు ఉండే అవకాశం ఉందని ఓ అధికారి చెప్పారు.

అరుదైన జంతు విక్రయాల ముఠాలు..

అంతరించిపోతున్న జంతువును వేటాడేందుకు ముఠాలు తిరుగుతుంటాయి. అలుగు, పులి, చిరుత, వాటి చర్మం, నక్షత్ర తాబేలు, రెండు తలల పాము, ఏనుగు దంతాలకు భారీగా డిమాండ్ ఉంటుందనే అపోహతో వీటికోసం వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. అలుగును ఒకరు రూ.30 వేలకు కొన్నట్లు సమాచారం. వాటి పొలుసులకు డిమాండ్ ఉంటుందనేది ప్రచారంలో ఉంది. ఇది చేతులు మారుతూ రూ.3 లక్షల ధర పలికినట్లు తెలిసింది. అరుదైన జంతువులకు ధరలు ఊహించుకుని వాటిని గుట్టుగా వేటాడుతూ దందా నడుపుతున్నారు.

పర్యవేక్షణ అంతంతే..

రాత్రిళ్లే ఎక్కువగా వేట సాగుతోంది. రాత్రిళ్లు అటవీ అధికారుల పర్యవేక్షణ ఉండటం లేదనే ఆరోపణలున్నాయి. వేటగాళ్లు ఆయుధాలతో ఉంటారు. ఇది అధికారులకు సమస్యగా మారింది. వారికి కూడా రక్షణ కరవైంది. తగిన చర్యలు తీసుకుని ఇప్పటికైనా వేటను అరికట్టాల్సిన అవసరం ఉంది.

ఉచ్చులు.. విద్యుదాఘాతం

జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్ తదితర జిల్లాల్లో దట్టమైన అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులున్నాయి. పులులు, చిరుతలు, జింకలు, దుప్పులు, కొండగొర్రెలు, కుందేళ్లు, అడవి దున్నలు, అడవి పందులు, తదితర జంతువులున్నాయి. రాత్రి వేళల్లో గుట్టుగా విద్యుదాఘాతం, ఉచ్చులతో వేటాడుతున్నారు. విద్యుదాఘతంతో మనుషులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. నాలుగేళ్ల క్రితం తాడ్వాయి అడవుల్లో పులిని కూడా వేటాడి చంపారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న అలుగు

వేటను అరికడుతున్నాం..

-వసంత, డీఎఫ్‌వో, జయశంకర్ భూపాలపల్లి

వన్యప్రాణుల వేటను అరికడుతున్నాం. వేటతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. వన్యప్రాణుల చట్టాలు, శిక్షలపై వివరిస్తున్నాం. రాత్రి పూట గస్తీ బృందాలను ఏర్పాటు చేశాం. ప్రజలు కూడా సహకరించాలి. వన్యప్రాణుల వేటపై సమాచారం ఇవ్వాలని కోరుతున్నాం.

హాని తలపెడితే శిక్ష తప్పదు..

- వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం కఠిన శిక్షలు ఉన్నాయి. పులిని ఆటపట్టించినా.. భయపెట్టినా ఆరు నెలలు శిక్ష పడుతుంది.
- పులి, అలుగు, ఇతర షెడ్యూల్-1లో పరిధిలోని ప్రాణులను వేటాడితే నాన్‌బెయిలబుల్ కేసు నమోదవుతుంది. 3 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా పడుతుంది.
- రెండోసారి కూడా అదే తప్పుచేస్తే రూ.25 వేల జరిమానా 3 నుంచి 7 సంవత్సరాల జైలు శిక్ష.
- పులి ఉండే అభయారణ్యంలోని కోర్ ఏరియాల్లో వేటాడితే 3 నుంచి ఏడేళ్ల జైలుశిక్ష పడుతుంది. రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు జరిమానా ఉంటుంది.
- రెండు అంతకంటే ఎక్కువసార్లు వేటాడితే రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు జరిమానా, ఏడేళ్ల జైలు శిక్ష పడుతుంది.
- పులిని వేటాడినట్లు సరైన ఆధారాలుంటే నిందితులను వారెంట్ లేకుండానే అరెస్టు చేయవచ్చు..

లలితా మహా త్రిపురసుందరి దేవిగా భద్రకాళి





పల్లకీలో అమ్మవారి ఉత్సవమూర్తి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అయిదోరోజు సోమవారం శ్రీభద్రకాళి అమ్మవారు లలితా మహా త్రిపురసుందరి(రాజరాజేశ్వరి)గా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి పల్లకీ సేవ, సాయంత్రం శేష వాహన సేవ జరిపారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు లలితా మహాయాగంలో పాల్గొన్నారు. 'కుడా' ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. -రంగంపేట, న్యూస్‌టుడే

'బోధనా రుసుం విడుదలైతేనే కళాశాలలు తెరుస్తాం'



రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమన్యాల సంఘు బాధ్యులు

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు దసరా తరువాత నిరవధికంగా మూసివేస్తున్నట్లు కాకతీయ విశ్వవిద్యాలయ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల సంఘ బాధ్యులు సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు. మూడేళ్ల నుంచి యాజమాన్యాలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల జాప్యం కారణంగా, పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉపకార వేతనాల విడుదలలో ఆలస్యం కారణంగా అధ్యాపకులకు, సిబ్బందికి వేతనాలు చెల్లించలేకపోతున్నామన్నారు. పది నెలలుగా ముఖ్యమంత్రికి, వివిధ శాఖల మంత్రులకు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా, నేటివరకు ఎలాంటి పరిష్కార నిర్ణయం వెలువడలేదన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పి.ఉపేందర్ రెడ్డి, కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధన

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఈ నెల ఒకటి నాటికి రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించినట్లు వరంగల్ డీసీసీబీ, రాష్ట్ర కో ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. రాష్ట్రంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులకు దీటుగా వరంగల్ డీసీసీబీ ఉత్తమ ఆర్థిక కార్యకలాపాలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. సోమవారం హనుమకొండలోని బ్యాంకు కార్యాలయంలో రవీందర్‌రావు అధ్యక్షతన బ్యాంకు మేనేజర్లు, సీఈవో, అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. తొలుత బ్యాంకు రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించినందుకు ఆయన కేకు కోసి బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్‌కు తినిపించారు. అనంతరం జరిగిన సమావేశంలో రవీందర్‌రావు మాట్లాడుతూ తాను ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సమయంలో రూ.12 వందల కోట్లు మాత్రమే టర్నోవర్ ఉందన్నారు. ఈ ఘనత సాధనలో తోడ్పడిన సహకార సంఘాల అధ్యక్షులు, బ్యాంకు మేనేజర్లు, ఉద్యోగులు, సీఈవోలు, ఖాతాదారులకు ధన్యవాదాలు తెలిపారు. రుణమాఫీ పొందిన బ్యాంకు పరిధిలోని రైతులందరికీ వెంటనే కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని మేనేజర్లకు సూచించారు. రుణమాఫీకి అర్హతగల రైతుల వివరాలను ప్రభుత్వానికి సమర్పించడంలో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై జిల్లా సహకార శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఇంకా డీసీసీబీ జీఎం ఉష, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, స్రవంతి, కృష్ణమోహన్, రాజునాయక్, ఉమ్మడి జిల్లాలోని బ్యాంకుల మేనేజర్లు, సీఈవోలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



లాంగ్ జంప్



-న్యూస్‌టుడే, వరంగల్ క్రీడావిభాగం

తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం సహకారంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజులపాటు జరిగే పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అథ్లెట్లు హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేషీ, స్పోర్ట్స్ ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొదట రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లో నిర్వహిస్తే బాగుండు అనుకున్నా.. కానీ! ఇక్కడి జేఎన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ చూసిన తర్వాత సంతోషం కలిగిందన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఛైర్మన్ వరద రాజేశ్వరరావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దీటుగా ఓరుగల్లులో క్రీడాకారులకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. జేఎన్ స్టేడియంలో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. గత నెలలో చెన్నైలో జరిగిన సౌత్ ఏషియన్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్(ఎస్ఏఏఎఫ్) గేమ్స్‌లో వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన వినోద్‌కుమార్ 800 మీటర్ల పరుగులో కాంస్యం, గచ్చిబౌళి అకాడమీకి చెందిన మోహిత్‌చౌదరి 3000 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు సాధించారు. వారిని రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో సత్కరించి నగదు బహూకరించారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన అథ్లెట్లకు అతిథులు వ్యక్తిగత మెడల్స్ అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి, నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్‌లు శ్రీమాన్, నాగరాజు, పీడీలు సాంబమూర్తి, మహేందర్, కృష్ణ, రజినీకాంత్, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.



అండర్-20 బాలికల 800 మీటర్ల పరుగులో విజేతలు



60 మీటర్ల పరుగు పందెం..

నేటి నుంచి రైళ్ల పునరుద్ధరణ

కాజీపేట, న్యూస్‌టుడే : పక్షం రోజులుగా రద్దయిన రైళ్లు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వరంగల్- హసన్‌పర్తి రోడ్ మధ్య నాలుగో లైను పనుల కారణంగా సెప్టెంబరు 22 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు కాజీపేట- బల్లార్షా, వరంగల్- బల్లార్షా మార్గంలో నడిచే దాదాపు అన్ని రైళ్లను రద్దు చేశారు. కొన్ని రైళ్లను దారి మళ్లించారు. దూర ప్రాంత రైళ్లను మాత్రం నడిపించారు. రద్దయిన కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, రామగిరి, ఇంటర్‌సిటీ, సింగరేణిలు 8వ తేదీన, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ 9వ తేదీ నుంచి ప్రారంభమౌతాయి. పండగ వేళ రద్దు కావడంలో ప్రయాణికులు ఇప్పటికే ఇతర మార్గాల ద్వారా ప్రయాణాలు చేశారు. నేటి నుంచి పునఃప్రారంభం అవుతుండటంతో ఇప్పటికే చాలా మంది రిజర్వేషన్లు చేసుకున్నారు. కాగజ్‌నగర్, ఇంటర్‌సిటీలో వెయిటింగ్ లిస్టు ఎక్కువగా ఉంది.

దోపిడీ దొంగలకు ఏడేళ్ల జైలు శిక్ష

వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: పట్టపగలు ఇంట్లో చొరబడి.. విలువైన బంగారు ఆభరణాలు, డబ్బు దోచుకెళ్లిన నలుగురు దోపిడీ దొంగలకు ఏడేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ.. హనుమకొండ జిల్లా ప్రధాన సహాయ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి క్షమాదేశ్‌పాండే సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కేసు వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ నగరంలోని గణేశ్‌నగర్‌కు చెందిన అలవాల సమ్మయ్య 2014 సెప్టెంబరు 26న మధ్యాహ్నం బయటకు వెళ్లారు. అదే సమయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా గోదావరిఖనికి చెందిన షేక్ అలీ హైదర్, కుమారస్వామి, శంకర్, మధుకర్, కోరుట్లకు చెందిన శివకృష్ణ, మహ్మద్ అసీఫ్ ఒక ముఠాగా ఏర్పడి.. హనుమకొండలోని గణేశ్‌నగర్‌కు వచ్చారు. అలవాల సమ్మయ్య భార్య ఒంటరిగా ఇంట్లో ఉండటాన్ని గమనించారు. బయట ఒకరు కాపలా ఉండి.. మిగతావారు ఇంట్లో చొరబడి ఆమెను బంధించారు. విలువైన వస్తువులు మూటగడుతుండగా.. అదే సమయంలో బయటకు వెళ్లిన సమ్మయ్య ఇంటికి వచ్చారు. బయట ఉన్న వ్యక్తిని ఎవరు నువ్వు అని ప్రశ్నించగా.. అతడు సమ్మయ్యను బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి బంధించాడు. అనంతరం ఆభరణాలు, నగదు, చరవాణులతో ఉడాయించారు. బాధితుడు సమ్మయ్య ఫిర్యాదు మేరకు హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అనంతరం న్యాయస్థానంలో నేరారోపణ పత్రాన్ని దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో కోర్టు పైవిధంగా శిక్ష విధించింది. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ వాదించారు. విచారణ సందర్భంగా కోర్టు కానిస్టేబుల్ సుభాష్ సాక్ష్యులను ప్రవేశపెట్టారు.

నేటి నుంచి రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన

గోపాలపూర్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర చేనేత, జౌళి శాఖల ఆధ్వర్యంలో హనుమకొండలోని ఎన్జీవోస్ కాలనీ రోడ్‌లోని రెడ్డి మ్యారేజ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నుంచి ఈ నెల 21 వరకు రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వరంగల్ చేనేత, జౌళి శాఖ ఏడీ రాఘవరావు తెలిపారు. ప్రదర్శనలో నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరలకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో పాల్గొనే చేనేత సహకార సంఘాలు, సంస్థలు ఎలాంటి రుసుం లేకుండా అమ్మకాలు జరుపుకోవచ్చన్నారు. ప్రదర్శనలో పోచంపల్లి, వెంకటగిరి, మంగళగిరి, ఉప్పాడ, చీరాల చీరలు, డ్రెస్ మెటీరియల్స్, కరీంనగర్ బెడ్ షీట్లు, లుంగీలు, టవళ్లు, పత్రంజిలు, కార్పెట్లు తదితరాలు విక్రయిస్తారని తెలిపారు. పలు రాష్ట్రాల నుంచి 60 ప్రాథమిక చేనేత సహకార సంఘాలు పాల్గొంటున్నట్లు రాఘవరావు తెలిపారు.

రసం పీల్చే.. పురుగుల పనిపడదాం..!



ఉమ్మడి వరంగల్ జిల్లాలో పత్తి ప్రధాన వాణిజ్యపంటగా ఉంది. పూత, కాతగా దశలో ఉండగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పత్తిలో ప్రధానంగా రసం పీల్చే పురుగులు ఉద్ధృతి పెరుగుతున్న పరిస్థితిని గమనించామని మల్యాల కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మాలతి, పంట ఉత్పత్తి విభాగ శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్ తెలిపారు. సస్యరక్షణ చర్యలను 'రైతేరాజు'కు వివరించారు.

-న్యూస్‌టుడే, మానుకోట

పేనుబంక : లేత కొమ్మలు, ఆకుల అడుగు భాగాల నుంచి తల్లి, పిల్ల పురుగులు రసం పీల్చుతాయి. ఆకులు దోనెలుగా మారడం, తేనె వంటి జిగురు పదార్థం విసర్జించడం వల్ల ఆకులపై నల్లని బూజు ఏర్పడుతుంది. నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తామరపురుగు : తల్లిపిల్ల పురుగులు సన్నగా పసుపు రంగులో ఉండి రసం పీల్చుతాయి. ఆకులు పెలుసుగా మారుతాయి. నివారణకు.. మోనోక్రొటోఫాస్ 1.6 మి.లీ లేదా ఎసిఫేట్ 75 ఎస్‌పీ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లీటర్ నీటికి లేదా డైఫెన్ థయురాన్ 1.25 గ్రాములు లేదా స్పెనీటోరం 0.9 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పిండినల్లి : చిన్న పురుగులు లేత పసుపు రంగులో ఉంటాయి. తల్లిపురుగులు రెక్కలు లేకుండా మైనపు పూత గల వెంట్రుకలతో కప్పబడి ఉంటాయి. ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణకు ప్రొపెనొఫాస్ 50 ఈసీ లేదా మిథైల్‌పారాథియాన్ 50 ఈసీ ఎసిఫేట్ 2 గ్రాములు+ట్రైటాన్ లేదా సాండొవిట్ లాంటి జిగురు మందులు ఒక మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పచ్చదోమ : ఆకుల అడుగుభాగాన పిల్ల, తల్లి పురుగులు చేరి రసం పీల్చడం ద్వారా ఆకుల ఈనెలు దోనెలుగా ముడుచుకుని పసుపు రంగులో మారుతాయి. నివారణకు.. ఇమిడాక్లోప్రిడ్ లేదా ఫ్లొనికామైడ్ లేదా ఫిప్రొనిల్ లీటరు నీటికి రెండు మి.లీ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఎసిఫెట్ 75 ఎస్‌పీ ఒకటిన్నర గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తెల్లదోమ : పిందె, కాయ దశలో ఆశిస్తుంది. పురుగు సోకిన మొక్కలు గిడసబారి పూమొగ్గలు, కాయలు రాలిపోతాయి. నివారణకు డైఫెన్‌థయురాన్ 1.25 గ్రాములు లేదా స్పైరొమెసిసిన్ ఒక మి.లీ లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రాములు లేదా సల్ఫాక్సాఫ్లోర్ 0.76 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

రైతేరాజు




మిరపనారు

కొంటున్నారా.. జాగ్రత్త సుమా!

మానుకోట, న్యూస్‌టుడే : మిరపనారు కొనుగోలులో రైతులు జాగ్రత్త వహించాలని మహబూబాబాద్ జిల్లా ఉద్యానశాఖ అధికారి జినుగు మరియన్న, వ్యవసాయాధికారిణి ఎం.విజయనిర్మల తెలిపారు. ధ్రువీకరించిన నర్సరీల నుంచి మాత్రమే మిరప నారును కొనుగోలు చేయాలి. ఇతర రాష్ట్రాలు, జిల్లాలు, ప్రాంతాల నుంచి వచ్చే మిరపనారు కొనుగోలును ఎలాంటి ధ్రువీకరణ, బిల్లులు లేకుండా కొనుగోలు చేయవద్దు. పేరొందిన కంపెనీలు, రకాల నారును వ్యవసాయ, ఉద్యాన శాఖలచే ధ్రువీకరించిన నర్సరీల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. ఈ విషయంలో సందేహాలు ఉంటే రైతులు ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులను సంప్రదించాలని చెప్పారు.

ప్రశ్న- సమాధానం

? యాసంగిలో కంది, పెసర సాగు చేసేందుకు అనువైన రకాలు, అవసరమైన విత్తనం.. ఎప్పటివరకు సాగు చేసుకోవచ్చో తెలపండి..? – మారపల్లి రామచంద్రారెడ్డి, హసన్‌పర్తి.



✔ యాసంగిలో పెసరను అక్టోబర్ చివరి వరకు విత్తుకోవచ్చు. పెసరలో ఎంజీజీ 295, ఎంజీజీ 397(మధిర), ఎంజీజీ 378(భద్రాద్రి), ఎంజీజీ 351(శ్రీరామ), డబ్ల్యూజీజీ 37 (ఏకశిల), డబ్ల్యూజీజీ 72(యాదాద్రి) రకాలు అనువైనవి. ఎకరాకు 6-8 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. కందిని అక్టోబర్ 15 వరకు ఏక పంటగా, వేరుసెనగతో మిశ్రమంగా సాగుచేసుకోవచ్చు. కందిలో డబ్ల్యూఆర్‌జీ 53, టీడీఆర్‌జీ 4, ఆర్‌జీటీ1, పీఆర్‌జీ 158, ఎంఆర్‌జీ 41, పీఆర్‌జీ 158 ఎంజీఆర్‌జీ 1004 రకాలు అనువైనవి. ఎకరాకు 6-8 కిలోల విత్తనం అవసరం. విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి.

-కె.దామోదర్‌రెడ్డి, ఏడీఏ, నర్సంపేట

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే



రైతు రవీందర్



సర్వి చెట్లు.. ఆదాయానికి మెట్లు

న్యూస్‌టుడే, రేగొండ(భూపాలపల్లి జిల్లా) : తక్కువ పెట్టుబడితో సర్వి మొక్కల పెంపకం చేపడితే మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం భాగిర్థిపేట గ్రామానికి చెందిన రైతు రవీందర్.. ఎకరానికి మూడేళ్లకు సుమారు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని 'రైతేరాజు'కు వివరించారు. 'భాగిర్థిపేటలో రెండెకరాలు, కొత్తపల్లిలో మరో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. కొత్తపల్లి గ్రామంలోని వ్యవసాయ భూమిలో రెండేళ్ల కిందట ఆయిల్‌పామ్ సాగు చేశాను. ఓ మిత్రుడి సూచనతో అంతర్గత పంటగా సర్వి మొక్కల పెంపకం చేపట్టాను. సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్ మిల్లు నుంచి రూ.2.40 పైసలకో మొక్క చొప్పున సుమారు 3600 మొక్కలు కొనుగోలు చేశాను. ఐదుగురు కూలీల సాయంతో రెండెకరాల్లో 19 నెలల కింద మొక్కలను నాటాను. 30 నుంచి 36 నెలలకు మొక్కలు కటింగ్ దశకు చేరుతాయి. ఒక్కో టన్నుకు రూ.5600 నుంచి రూ.6600 వరకు ధర ఉంటుందని కంపెనీ వారు చెప్పారు. ఎకరానికి సుమారు 60 నుంచి 70 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. రెండెకరాల్లో సుమారు 120 నుంచి 140 టన్నుల వరకు కలప వస్తే, టన్నుకు రూ.5600 ధర ఉన్నా ఆదాయం రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు వచ్చే అవకాశం ఉందని రైతు ఆశాభావం వ్యక్తం చేశారు. కంపెనీ(పేపర్ మిల్లు) వారే కొనుగోలు చేస్తామని చెప్పడంతో ఎలాంటి మార్కెటింగ్ ఇబ్బందులు లేవు. మొక్కలు, కూలీల, కలుపు మందులు రూపేణా ఇప్పటివరకు కేవలం రూ.10 వేల మాత్రమే ఖర్చయింది. ఆయిల్‌పామ్ కాత దశకు చేరేసరికి సర్వి మొక్కల పెంపకం పెంపకం అయిపోతుందని' వివరించారు.

విన్నవించాం.. ఆదుకోండి..!

మహబూబాబాద్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్‌కు తమ గోడు వెలిబుచ్చారు. క్షేత్రస్థాయిలో పలుమార్లు విన్నవించినా స్థానిక అధికారులు తమ మొర ఆలకించడం లేదు. మీరే ఆదుకోవాలంటూ జిల్లా పాలనాధికారిని వేడుకున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 74 దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిచి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పొ, ఎం.డేవిడ్, జడ్పీ సీఈవో నర్మద, డీసీవో వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యానశాఖాధికారి జి.మరియన్న, డీపీవో హరిప్రసాద్ తదితరులున్నారు.

మూడు చక్రాల మోటార్ వాహనం ఇవ్వరూ!

మహబూబాబాద్ మండలం నడివాడ గ్రామం పదోతరగతి వరకు చదువుకున్న మునిగె నాగరాజు బాల్యం నుంచి పోలియో వ్యాధితో రెండు కాళ్లు చచ్చుపడిపోయాయి. చేతులే ఆధారం. మూడు చక్రాల మోటార్ వాహనం కేటాయించాలని స్థానిక అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో కలెక్టర్‌ను కలిసి తన వేదనను వినిపించారు.



రికార్డుల్లో పేరు మాయం

ఇనుగుర్తి శివారు వీరారెడ్డిపల్లిలో గుగులోతు పీర్యాకు 20 ఏళ్ల నుంచి 1.16 ఎకరాల వ్యవసాయ భూమికి పట్టా ఉంది. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత ఎకరం భూమి రికార్డుల్లో మాయమైంది. సమీప గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన భూమిని అతని పేరిట ధరణిలో నమోదు చేయించుకున్నారు. మిగిలిన 16 గుంటల భూమి కొన్ని రోజులు రికార్డుల్లో కనిపించింది. ఇప్పుడు భూమి రికార్డుల్లో కనిపించడం లేదు. నా భూమి వేరే వ్యక్తి పేరిట చేయించుకున్నాడని అధికారులకు విన్నవిస్తే స్పందించడం లేదు. సమగ్ర విచారణ చేసి ఆ భూమిని తనపేరిట మార్పిడి చేయాలని కోరారు.



ఆ మహిళా పేరు తొలగించాలి

డోర్నకల్ మండలం గొల్లచెర్ల శివారు కొత్త దుబ్బతండాకు చెందిన రైతు దారావతు బాలాజీ, మౌనిక దంపతులు, వారి కూతురు సింధు ఉంటున్నారు. బాలాజీ డోర్నకల్‌లోని యూనియన్ బ్యాంక్‌లో రూ.1.92 లక్షలు పంట రుణం పొందారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకున్న రూ. 2 లక్షలు రుణమాఫీ అవుతుందని ఆనందించారు. బ్యాంకు అధికారులు మహబూబాబాద్‌లో ఎస్‌బీఐ గుముడూర్ శాఖలో ఓ మహిళ పేరిట రూ. 1.14 లక్షలు రుణం ఉందని ఆమెను తమ కుటుంబ సభ్యురాలిగా చూపించి తనకు రుణమాఫీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మహిళను తమ కుటుంబసభ్యుల నుంచి తొలగించి రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.





ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

☛ ఆహార విక్రయ దుకాణాలపై అధికారులు తనిఖీలు నిర్వహించాలని మహబూబాబాద్ వినియోగదారుల సంక్షేమ మండలి అధ్యక్షుడు మామిడాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాసులు, కార్యదర్శి ఎస్.కె.జానీ కలెక్టర్‌కు విన్నవించారు. హోటళ్లు, బిర్యానీ సెంటర్లు, స్వీట్‌హౌజ్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించాలని కోరారు.

బియ్యం లారీకి ముళ్ల కంచె రక్షణ..!



అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని గత నెల 30న పోలీసులు పట్టుకొని నర్సింహులపేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో వానరాలకు రోజు లారీలోని బియ్యం తింటున్నాయి. దీంతో ఉపాయం ఆలోచించి లారీ చుట్టూ ఇలా ముళ్లకంచెను రక్షణగా అడ్డుపెట్టారు. అయినా చెట్టుపై నుంచి లారీలోకి వెళ్లి ఆహారం కోసం తిప్పలు పడుతుండగా 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. – న్యూస్‌టుడే, నర్సింహులపేట (మరిపెడ)

జిల్లాస్థాయి పద్మశాలి ప్రతిభా పురస్కారాలు



దంతాలపల్లి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పోపా ప్రతినిధులు

దంతాలపల్లి, నర్సింహులపేట, న్యూస్‌టుడే: తొర్రూరులోని నితిన్ ఫౌండేషన్‌లో మానుకోట జిల్లాస్థాయి పద్మశాలి ప్రతిభా పురస్కార్-2024ను ఈ నెల 11న అందించనున్నట్లు పోపా జిల్లా అధ్యక్షుడు బుదారపు శ్రీనివాస్ తెలిపారు. దంతాలపల్లిలో ప్రతిభా పురస్కారాలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. జిల్లాలోని పద్మశాలి విద్యార్థులు 2024లో పీజీ మెడిసిన్, ఎంబీబీఎస్, బీడీఎస్, ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీలో ప్రవేశాలు, పది, ఇంటర్‌లో ఉత్తమ గ్రేడ్లు, ప్రభుత్వ ఉద్యోగాలు, రాష్ట్రస్థాయి క్రీడా పతకాలు సాధించిన వారికి ఈ పురస్కారాలు అందించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు తమ వివరాలు, ధ్రువపత్రాలను వాట్సాప్ నెంబర్లు 9441670810, 9441055082, 9440672321కు ఈ నెల 9వ తేదీలోగా పంపించాలని కోరారు. సంఘం బాధ్యులున్నారు. నర్సింహులపేటలో పోపా మండల అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పోపా ప్రతిభా పురస్కారాలను అందిస్తోందన్నారు.

డంపింగ్‌యార్డు వద్ద ఉద్రిక్తత



తొర్రూరు, న్యూస్‌టుడే: తొర్రూరు మున్సిపాలిటీకి డంపింగ్‌యార్డు సమస్య తలనొప్పిగా మారింది. చింతలపల్లి శివారు హచ్చుతండా వద్ద డంపింగ్‌యార్డులోకి చెత్తను తరలిస్తుండటంతో తండావాసులు అడ్డుకుంటున్నారు. పోలీసుల పహారా మధ్య సోమవారం తిరిగి చెత్తను తీసుకువచ్చారు. దీంతో తండావాసులు స్థానిక సీఐ జగదీష్, ఎస్సై ఉపేందర్‌లతో తాము రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బయోప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుందని మున్సిపల్ అధికారులు వారికి సూచించారు. ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పలువురిని ముందస్తుగా స్టేషన్‌కు తరలించారు. దీంతో 8 నెలల విరామం తరువాత యార్డుకు చెత్త తరలింపు ప్రారంభమైంది.

ఉద్యోగం ఇప్పించాలని వినతి

తొర్రూరు, న్యూస్‌టుడే: మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యానికి మృతిచెందిన కంఠాయపాలెం గ్రామ క్షేత్రసహాయాధికారి రమేష్ సతీమణి రచనకు ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో నర్సింగరావుకు కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు మార్క సాంబయ్య మాట్లాడుతూ.. నాడు మాట ఇచ్చి, నేడు దాటవేత దోరణిని ప్రదర్శించడం సరికాదన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. సీపీఎం నాయకులు యాకయ్య, జితేందర్‌రెడ్డి, నజీర్, శ్రీనివాస్, సురేష్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు వార్తలు

రావణవధ ఏర్పాట్ల పరిశీలన

తొర్రూరు, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా డివిజన్ కేంద్రంలోని యతిరాజారావు పార్కులో ఓట్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకల ఏర్పాట్లను సోమవారం ప్రజాప్రతినిధులు, సంస్థ నిర్వాహకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ టీపీసీసీ సభ్యుడు కె.నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఝాన్సీరెడ్డిల ఆదేశాల మేరకు వేడుకల ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మున్సిపల్ ఛైర్మన్ రామచంద్రయ్య, పార్టీ నాయకులు తిరుపతిరెడ్డి, విజయపాల్‌రెడ్డి, తదితరులున్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

తొర్రూరు, న్యూస్‌టుడే: డివిజన్ కేంద్రంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని అమ్మాపురంలో సోమవారం ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మందికి డాక్టర్ వేణుగోపాల్‌రావు పరీక్షలు నిర్వహించగా 25 మందికి శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి నవీన్‌కుమార్, రమేష్, శంకర్ మాట్లాడారు. క్లబ్ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, కోటయ్య తదితరులున్నారు.

'భాజపా అధికారంలోకి రావడం తథ్యం'



దంతాలపల్లిలో సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

దంతాలపల్లి, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో తెలంగాణలో భాజపా అధికారంలోకి రావడం తథ్యమని మాజీ ఎంపీ సీతారాంనాయక్ చెప్పారు. సోమవారం దంతాలపల్లిలో చేపట్టిన ఆన్‌లైన్ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. బంజారా భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. తెలంగాణలోని రెండు ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించాలన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చి తీరుతుందని, తాను మంత్రి అవుతానని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ జడ్పీటీసీ సభ్యురాలు భూక్యా సంగీత, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్, మండల ఉపాధ్యక్షుడు సాయికుమార్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలని వినతి

దంతాలపల్లి, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దంతాలపల్లిలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ చంద్రరాజేశ్వర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. పార్టీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్న హామీలను అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. వర్షాలు, వరదలతో దెబ్బతిన్న చెరువులు, కుంటల, రహదారుల మరమ్మతు చేపట్టాలన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. నాయకులు పెద్ద లింగన్న తదితరులున్నారు,

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ



మహబూబాబాద్‌లో ఉదయచందర్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

మహబూబాబాద్, మరిపెడ, కొత్తగూడ, న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. మరిపెడలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నూకల నరేష్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నరేష్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొత్తగూడ మండలం గోపాలపురంలోని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ తల్లి సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మరణించారు. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సమ్మక్క చిత్రపటానికి పూలమాల వేశారు.

ఇద్దరికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష

ఆలేరు, న్యూస్‌టుడే: మారణాయుధాలు కలిగి ఉండి పోలీసులకు పట్టుబడిన కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ భువనగిరి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి తీర్పునిచ్చారని ఆలేరు ఎస్సై పి.రజనీకర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లా కొత్త పాల్వంచకు చెందిన వనపాకుల రాంబాబు అలియాస్ ఆజాద్ అలియాస్ ఈశ్వర్(35), వరంగల్ జిల్లా కేసముద్రం మండలం మహమూద్‌పట్టణానికి చెందిన పిట్టల శ్రీనివాస్ అలియాస్ రాము(38) తుపాకీ(పిస్టల్)తో ఇతరులను బెదిరిస్తూ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. 2011లో ఆలేరు శివారులో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టిన క్రమంలో పట్టుబడ్డారు. ఇద్దరి నుంచి రెండు పిస్టళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఇద్దరు నిందితులను దోషులుగా నిర్ధారించారు. ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సత్యనారాయణ ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. కోర్టు కానిస్టేబుల్ డి.స్వామి కేసు ట్రయల్ నడిపించారు.

ఎస్టీ బాలుర వసతిగృహం ఏర్పాటు చేయాలి

గార్ల, న్యూస్‌టుడే: గార్ల ఏజెన్సీ మండలంలో గిరిజన బాలుర వసతిగృహాన్ని ఏర్పాటు చేయాలని బీఎస్పీ ఇల్లెందు నియోజకవర్గ అధ్యక్షుడు వెంకన్ననాయక్ డిమాండు చేశారు. మండలంలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్ జర్పుల సుధాకర్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. బీఎస్పీ మండలాధ్యక్షుడు ఎం.సుధాకర్, సేవాలాల్‌సేన అధ్యక్షుడు సాయికుమార్, రవి ఉన్నారు.

పంచాయతీ సిబ్బంది సమ్మె

మహబూబాబాద్, న్యూస్‌టుడే: బకాయిపడిన వేతనాలను చెల్లించాలని కోరుతూ సోమవారం పంచాయతీ సిబ్బంది కలెక్టరేట్ ఎదుట మెరుపు సమ్మె చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, యూనియన్ నాయకులు ధర్మారపు సుధాకర్, మొయినుద్దీన్, ఎల్లయ్య, లతీఫ్, ఉపేంద్రాచారి, జానీ, కుమారస్వామి, దస్తగిరి, చంద్రకళ పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునది నా క్లయింటు అయిన **గద్దం సోమలక్ష్మి, భర్త: లేటు సోమయ్య,** సాకిన్: మహబూబాబాద్ పట్టణము మరియు జిల్లా గారి ఆదేశానుసారము ఇవ్వు పత్రికా ప్రకటన ఏమనగా!

నా క్లయింటు అయిన సోమలక్ష్మి గారికి ఇంటి నెంబర్ 6-1-108/131 గల ఇల్లు మరియు ఖాళీ స్థలము మొత్తము విస్తీర్ణము 428 చ॥ గజములలో యన్.జి.ఓ. కాలనీ, మహబూబాబాద్ పట్టణములో కలదు. ఈ క్రింద తెలిపిన షెడ్యూలులో ఆస్తి వివరములు కలవు. ఇట్టి ఇల్లు మరియు ఖాళీ స్థలమును సమ భాగములుగా (ఒక్కొక్కరికి 1/2 వాటాలుగా) తన ఇద్దరు మనవళ్లు అయిన గద్దం తరుణ్, తండ్రి: నరేందర్ మరియు గద్దం సాయిప్రేమ్, తండ్రి: ప్రతాప్‌లకు ఇచ్చుటకు నిర్ణయించుకొని, దిది: 07-10-2023న గద్దం తరుణ్‌కు షెడ్యూలులో చూపిన ఆస్తిలోని సగభాగమును గిఫ్ట్ దస్తావేజు నెంబర్లు 12616/23 మరియు 12617/23, ద్వారా రిజిస్ట్రేషన్ చేయడమైనది. మరియు సగభాగమును గద్దం సాయి ప్రేమ్‌కు చేయుటకు ఒప్పుకున్నది.

కాని నా క్లయింటు రెండవ కుమారుడు అయిన **గద్దం ప్రతాప్** తన కుమారుడి పేర సగభాగమును రిజిస్ట్రీ చేసుకుంటానని చెప్పి దిది: 20-02-2024వ తారీఖున తన కుమారుడైన సాయి ప్రేమ్‌కు బదులుగా మొత్తం షెడ్యూలు ఆస్తిని నా క్లయింటుకు చెప్పకుండా మోసపూరితంగా వృద్ధాప్యం వల్ల ఆరోగ్యము బాగా లేనందున దస్తావేజును చూడలేక పోయినది మరియు నా క్లయింటు అమ్మినట్టు రిజిస్ట్రీ చేయించినాడు. తన భార్య అయిన **అనిత** [illegible]

[illegible]

సం/- కుమారస్వామి వెలిది, న్యాయవాది, మహబూబాబాద్ పట్టణం 506101, సెల్: 9440107127

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

కేసముద్రం, తొర్రూరు, న్యూస్‌టుడే: జిల్లాలోని కేసముద్రం, తొర్రూరు మండలాల్లో సోమవారం వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. కేసముద్రంలోని బిచ్చానాయక్ తండా సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో తెల్లబండ తండాకు చెందిన బాదావతు సురేష్ గాయపడినట్లు ఎస్సై మురళీధర్‌రాజు తెలిపారు. కేసముద్రం(వి) గ్రామానికి చెందిన సంజీవ ద్విచక్రవాహనంపై గూడూరు నుంచి వస్తుండగా కేసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో అదుపు తప్పి రోడ్డుపక్కన పడిపోయారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో 108లో మహబూబాబాద్ ఏరియాలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ తరలించినట్లు ఎస్సై తెలిపారు. తొర్రూరు మండలంలోని మడిపల్లి గ్రామశివారులో చెర్లపాలెం గ్రామానికి చెందిన ధర్మారపు సాయమ్మ తన మనవడు మహేందర్‌తో కలిసి నెల్లికుదురు మండలం నైనాలకు బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. సాయమ్మకు తీవ్రగాయాలు కాగ మహేందర్ స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను 108 వాహనంలో ఈఎంటీ ఉదయ్‌కుమార్, పైలెట్ రమేష్‌లు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. సాయమ్మకు కాలు తొలగించాలని వైద్యులు సూచించారని సిబ్బంది తెలిపారు.

పాముకాటుతో బాలుడి మృతి



రిషి(పాతచిత్రం)

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: పాము కాటుతో బాలుడు మృతి చెందిన విషాదఘటన మహబూబాబాద్‌లోని పత్తిపాకలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కొంగర కుమార్ కుమారుడు కొంగర రిషి(15)ఇంట్లో నిద్రిస్తున్న క్రమంలో అర్ధరాత్రి పాము కాటేసింది. బాలుడు లేచి చూసేసరికి పాము వెళ్తూ కనిపించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. తండ్రి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పి.దేవేందర్ తెలిపారు.

మహిళ మెడలోంచి బంగారు గొలుసు అపహరణ

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: పండగ వేళ అందరూ ఇళ్లలోనే ఉన్నారు.. వీధిలో ఎవరూ లేని సమయాన్ని అదనుగా చూసి గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి ఓ మహిళ మెడలోంచి నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరించాడు. ఈ సంఘటన మహబూబాబాద్‌లోని కృష్ణకాలనీలో సోమవారం సాయంత్రం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాలమేరకు.. కాలనీలో ఉంటున్న విశ్రాంత ఉపాధ్యాయులు మంగళపల్లి సోమయ్య భార్య మంగళంపల్లి సోమలక్ష్మి సాయంత్రం నాలుగు గంటల సమయంలో తన మనువడు ఆడుకుంటుండగా ఇంటి ముందు నిలుచున్నారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని దుండగుడు ఆమె మెడలో ఉన్న మూడున్నర తులాల పుస్తెల తాడు, తులంన్నర గొలుసును లాక్కొన్నాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చేలోపే దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. అరతులం గొలుసు ముక్క మిగిలింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పట్టణ సీఐ దేవేందర్, సీసీఎస్ సీఐ హతిరాం, ఎస్సై తాహెరబాబా బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలలో పరిశీలించారు.



బాధితురాలు సోమలక్ష్మి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

● పట్టణంలోని కంకరబోడ్ కాలనీల్లో గత నెల 3వ తేదీన చైన్ స్నాకింగ్‌కు పాల్పడి ఓ మహిళ మెడలోంచి నాలుగు తులాల బంగారు అభరణాలు అపహరించిన విషయం తెలిసిందే. వరుసగా గొలుసు దొంగతనాలు జరుగుతుండటంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టనున్నట్లు సీఐ దేవేందర్ తెలిపారు.


శతాధిక వృద్ధురాలి మృతి



కనికిచర్ల గోవిందమ్మ (పాత చిత్రం)

ఇనుగుర్తి, న్యూస్‌టుడే: ఇనుగుర్తికి చెందిన శతాధిక వృద్ధురాలు అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కనికచర్ల గోవిందమ్మ (100) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమారులు ముగ్గురు కూమార్తెలు ఉన్నారు.

ప్రజా పోరాటాలతోనే గుర్తింపు



మాట్లాడుతున్న నాగయ్య

కురవి, న్యూస్‌టుడే: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తేనే తగిన గుర్తింపు వస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గొల్లపల్లి నాగయ్య అన్నారు. మండలంలోని బలపాలలో మాజీ సర్పంచిగా ప్రజలకు సేవలు అందించిన పిట్టల దర్గయ్య సంస్కరణ సభ బలపాలలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన స్తూపాన్ని ఆవిష్కరించి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దర్గయ్య పార్టీ కోసం పని చేయడంతో పాటు స్థానిక సమస్యలు పరిష్కరించడంతో అన్ని వర్గాల ప్రజలు ఆయనను సర్పంచిగా గెలిపించారని పేర్కొన్నారు. నాయకులు రాములు, శ్రీనివాస్, కోటయ్య, వెంకన్న, రాజు, వెంకన్న, మల్లయ్య, సుధాకర్, కిషన్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

వెండి హారతి బహూకరణ

కురవి, న్యూస్‌టుడే: కురవి శ్రీ వీరభద్రస్వామి ఆలయానికి మహబూబాబాద్‌కు చెందిన గోన శ్యామ్‌రావు, సునీత దంపతులు రూ.15,500 వ్యయంతో తయారు చేసిన వెండి హారతి, గంటను బహూకరించారు. సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీనివాసులకు అందించారు. శ్రీనివాసరావు, మాధవి, వినోద ఉన్నారు.

ఎస్పీకి ఫిర్యాదు

నెహ్రూసెంటర్: ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు సలాంపై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన నరసింహ సరస్వతిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ముస్లిం మత పెద్దలు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు అక్బాల్ మౌలాన, మహ్మద్ అలంగీర్, మహ్మద్ అబ్దుల్ హమీద్, ఖలీల్ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు

నర్సింహులపేట: ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు తహసీల్దార్ చప్పిడి నాగరాజు అన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం ఆకేరును సందర్శించి ఇసుక తరలిస్తున్న ర్యాంపుల దారుల్లో జేసీబీ యంత్రంతో గుంతలు తీయించినట్లు తెలిపారు. ఆర్ఐ అఖిల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ

కొత్తగూడ: కొత్తగూడలోని వివిధ గ్రామాలల్లో మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం జారీ చేసిన చీరలను పంచాయితీ కార్యదర్శులు పంపిణీ చేశారు. ఎదుల్లపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రాజేందర్ ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులకు సోమవారం చీరలను పంపిణీ చేశారు.

గార్ల: మండల వ్యాప్తంగా 5,752 బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారుల సమక్షంలో ప్రారంభించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఈ పంపిణీ ప్రకియను జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో డ్వాక్రా మహిళాసభ్యులకు నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఎంపీడీవో మంగమ్మ, ఉప తహసీల్దార్ జర్పుల సుధాకర్‌నాయక్, ఏపీఎం నరేంద్రకుమార్, ఆర్ఐ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి కిషన్ తదితరులు ఉన్నారు.

పెంచిన కూలీ రేట్లను అమలు చేయాలని నిరసన

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పని చేస్తున్న దడువాయిలకు, హమాలీలకు పెంచిన కూలీ రేట్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మార్కెట్‌లో దడువాయిలు, హమాలీలు నిరసన వ్యక్తం చేశారు. వారం రోజుల కిందట ఉత్తర్వులు వచ్చినప్పటికి మహబూబాబాద్ మార్కెట్‌లో అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు.

ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారం

నెహ్రూసెంటర్: ఏకలవ్య ప్రభుత్వ ఆదర్శ గురుకుల పాఠశాల బోధనేతర సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం సంఘటితం కావాలని ఏకలవ్య ప్రభుత్వ ఆదర్శ గురుకుల పాఠశాల ఒప్పంద ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి నరేష్, కార్యదర్శి బొద్దికోల శిరీష అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ వేడుకల మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రమణ, కోశాధికారిగా సోయం రమేష్, 19 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఆకేరు వరద బాధితులకు చేయూత

మరిపెడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన సీతారాం తండావాసులకు కాజీపేట ఫాతిమా చర్చి ఆధ్వర్యంలో నిత్యావసరాలు తహసీల్దార్ సైదులు, ఎస్సై సతీష్ అందజేశారు. ఫాదర్ కాసు మర్రెడ్డి, దయాసాగర్, టామీ, ప్రకాష్‌రెడ్డి, ఎంపీవో సోమ్లానాయక్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు లచ్చయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ డ్రైవర్‌పై ఫిర్యాదు

నర్సింహులపేట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ ద్విచక్రవాహనదారుడు వెళ్లేందుకు దారి ఇవ్వకుండా దురుసుగా ప్రవర్తించి, బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై స్థానిక ఠాణాలో సోమవారం గ్రామస్థుడు చందు అనిల్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రకటన

ICICI HOME FINANCE COMPANY LIMITED [illegible]

[illegible]

సం/- **శ్యామల శ్రీనివాసరెడ్డి**, MBA, LL.B., **M.J. ప్రదీప్‌కుమార్**, LL.B., న్యాయవాదులు

సెల్: 9966434969

రవాణా కష్టాలు తీరేనా?

గార్ల, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లాగా ఆవిర్భవించినప్పటి నుంచి గార్ల మండలానికి టీఎస్‌ఆర్టీసీ బస్సుల నిర్వహణలో ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్నారు. కొవిడ్ సమయంలో బస్సులు నడిపి ఆదాయం రావటం లేదంటూ నిలిపివేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నూతన రైల్వే లైనుల నిర్మాణ పనుల్లో భాగంగా రైళ్లు తరచూ రద్దు అవుతున్నాయి. దీంతో రవాణా సౌకర్యాలు సరిపోక ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మానుకోట జిల్లాలో అనుసంధానానికి ముందు గార్ల మండలం ఖమ్మం జిల్లాలో ఉంది. ఖమ్మం డిపో నుంచి గార్ల, ఇల్లెందు, బయ్యారం, పోచారం బస్సులను ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. మానుకోట డిపో నుంచి బస్సుల నిర్వహిస్తే రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని ఈ ప్రాంతా ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. మహబూబాబాద్ డిపో బస్సులను గార్ల, డోర్నకల్ ఖమ్మం పట్టణానికి గతంలో మాదిరిగానే కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు. కాగా, జిల్లా డిపో బస్సులను పునరుద్ధరించాలని ఐద్వా మండల ప్రధాన కార్యదర్శి అలవాల సత్యవతి కోరారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సులని ప్రకటించినా గార్ల మండలానికి మాత్రం డిపో బస్సులకు నోచుకోని దుస్థితి కొనసాగుతుందన్నారు.



గార్ల బస్టాండ్